సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం। 5। జనవరి। 2024



అత్తరు నుంచి హల్వా వరకు..
జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్ ఆకట్టుకుంటోంది. విభిన్న రకాల వస్తువులు ప్రదర్శిస్తున్నారు. - 8లో



ఉచిత న్యాయసేవలు..
లోక్ అదాలత్‌లతో ఉచిత న్యాయ సేవలు అందుతాయి. వాటిపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. - 8లో

8న నీలమణి దుర్గ ఆలయం హుండీ ఆదాయం లెక్కింపు
పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం నీలమణి దుర్గ ఆలయంలో హుండీ కానుకల ఆదాయాన్ని ఈ నెల 8వ తేదీ సోమవారం ఉదయం పది గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ టి.వాసుదేవరావు, ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావులు గురువారం తెలిపారు. ఈ లెక్కింపునకు గ్రామ పెద్దలు, భక్తులు హాజరు కావాలని కోరారు.

న్యూస్‌రీల్

‘అంగన్‌వాడీలు విధుల్లో చేరుతున్నారు’



శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు తమ సమ్మెను విరమించి విధుల్లో చేరుతున్నారని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖాధికారి బి.శాంతిశ్రీ గురువారం పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 322 మంది అంగన్‌వాడీ సిబ్బంది గురువారం స్వచ్ఛందంగా విధుల్లో చేరారని తెలిపారు. వీరిలో అత్యధికంగా గార మండలంలో 229 మందిలో 133 మంది, శ్రీకాకుళం కేంద్రంలో 176 మందిలో 98 మంది, మందసలో 40, కొత్తూరులో 22, కోటబొమ్మాళిలో 12 మంది విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు. శుక్రవారం నాటికి 75 శాతం మేర అంగన్‌వాడీలు విధుల్లో చేరుతారన్న నమ్మకం ఉందన్నారు.

బ్రెయిలీ మహోన్నత వ్యక్తి



బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: లూయీ బ్రెయిలీ మహోన్నత వ్యక్తి అని, అంధులకు కావాల్సిన లిపిని తయారు చేశారని డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ డీవీ విద్యాసాగర్ అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో గురువారం లూయీ బ్రెయిలీ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బ్రెయిలీ ఘనతలను వివరించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయసంచాలకులు కె.కవిత, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుధ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు పరిశీలన

బూర్జ : మండలంలో గల గిరిజన గ్రామాల్లో పీవీటీజీ ప్రధాన మంత్రి ఆవాస యోజనా కింద ఇళ్ల నిర్మాణాల కోసం హౌసింగ్ పీడీ నక్క గణపతిరావు గురువారం పరిశీలన చేశారు. వైకుంఠపురం పంచాయతీ అల్లిపల్లి గూడలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో ఇళ్లు నిర్మించే లబ్ధిదారులను గుర్తించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సత్యం, పంచాయతీ కార్యదర్శి హెచ్. సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

● పింఛన్ రూ.3వేలకు పెంపు

ఊరూరా వేడుక..

అది కేవలం డబ్బు కాదు.. ప్రభుత్వం పేదలకు ఇస్తున్న భరోసా. అది కేవలం అదనపు ధనం కాదు.. సర్కారు జనాలకు చేసిన ప్రమాణం. అది కేవలం పింఛను కాదు.. ఓ నాయకుడు ఇంటింటికీ ‘నేను మీ బిడ్డను’ అని చెప్పిన సాధనం. పెరిగిన పింఛన్ మొత్తం లబ్ధిదారుల ముఖాల్లో నవ్వును విరబూయించింది. సంక్షేమానికి మరోపేరుగా మారిన సీఎం వైఎస్ జగన్‌ను పేద ప్రజలకు మరింత దగ్గర చేసింది. పింఛన్ పంపిణీ ఊరూరా వేడుకలా సాగుతోంది. – సాక్షి నెట్‌వర్క్



కాశీబుగ్గ: చినబాడాంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అవ్వాతాతలు



శ్రీకాకుళం రూరల్: సింగుపురంలో పెన్షన్‌ను అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు



ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురంలో మహిళకు నూతన పింఛన్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త దువ్వాడ వాణి

మళ్లీ గెలిపించుకుంటాం..



నాకు కొత్తగా పెన్షన్ మంజూరు చేశారు. మొట్ట మొదట పెన్షన్ రూ. 3000 తీసుకోవడం చాలా సంతోషంగా ఉంది. నాకు ప్రతి నెలా మందుల ఖర్చులు అధికంగా ఉంటున్నాయి. నా కుటుంబాన్ని కష్టపెడుతున్నందుకు బాధ పడేదాన్ని. ఇప్పుడు పింఛన్ రూ.3వేలు వస్తుండడంతో చాలా ఆనందంగా ఉంది. మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించుకుంటాం.
చింతాడ కన్నతల్లి, మెయిన్‌రోడ్, ఆమదాలవలస, 16వవార్డు

కన్న కొడుకులా..



ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే కన్నకొడుకులా మాకు పింఛన్ అందజేస్తున్నారు. వృద్ధాప్యంలో ఎవరికీ మేం భారం కాకుండా ఈ పింఛనే ఆదుకుంటోంది. పింఛన్ మొత్తం రూ. 3వేలుకు పెంచడం సంతోషంగా ఉంది. ఇలాంటి సీఎం మళ్లీ రావాలని కోరుకుంటున్నాం. – సవలాపురుపు అప్పారావు, జగ్గుశాస్త్రులపేట, ఆమదాలవలస మున్సిపాలిటీ ఒకటోవార్డు

మరో పాతికేళ్లు ఏలాలి..



గతంలో రోజుల తరబడి తిరిగితే తప్ప పింఛన్ అందేది కాదు. నా మనవడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వృద్ధాప్య పింఛన్ ఇంటి వద్దకే పంపుతున్నాడు. రేషన్ కూడా ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు. పింఛన్ రూ.250 అదనంగా పెంచి ఈ రోజు రూ.మూడు వేలు ఇచ్చారు. నా మనవడు మరో పాతికేళ్లు చక్కగా పరిపాలించాలి. – రాపాక శేషమ్మ, బిర్లంగి, ఇచ్ఛాపురం మండలం

నేడు ద్వివార్షిక పథకాల పంపిణీ

● ఈ విడతలో జిల్లాలో 2143 మందికి రూ.3,11,64,678లు లబ్ధి



శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్హత ఉండి వివిధ కారణాల వల్ల పథకాల లబ్ధిపొందలేకపోయిన వారికి ద్వివార్షిక నవరత్నాలు పథకాల నగదును నేడు విడుదల చేయనున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లబ్ధిదారులకు డీబీటీ విధానంలో పథకాన్ని అందజేస్తారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం పది గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీసీ హాల్ నుంచి ఆ కార్యక్రమాన్ని అధికారులు, లబ్ధిదారులతో కలిసి వీక్షిస్తారు. కార్యక్రమంలో జిల్లాకు సంబంధించిన మంత్రులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు. ఈ ఏడాది నవరత్నాల్లో భాగంగా అర్హత ఉండి, వివిధ పథకాల్లో తప్పిపోయి, ఆ ప్రయోజనం పొందని వారికి ద్వివార్షిక కార్యక్రమంలో అందజేస్తున్నారు. ఈ విడతలో వివిధ పథకాలకు సంబంధించి జిల్లాలో 2143 మందికిగాను రూ. 3,11,64,678 లు విడుదల చేస్తున్నారు.

నవరత్నాలు - ద్వివార్షిక పథకాలు

పథకం పేరు	లబ్ధిదారులు	నగదు (రూ.ల్లో)
ఈబీసీ నేస్తం	29	4,35,000
జగనన్న అమ్మఒడి	1036	1,74,42,678
జగనన్న చేదోడు	555	55,50,000
వైఎస్ఆర్ కళ్యాణమస్తు	86	55,35,000
వైఎస్ఆర్ కాపు నేస్తం	18	2,70,000
వైయస్సార్ మత్స్యకార భరోసా	323	32,30,000
వైయస్సార్ నేతన్న నేస్తం	3	72,000
వైయస్సార్ వాహన మిత్ర	93	13,30,00
మొత్తం	2143	3,11,64,678

స్వయం ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ ఆవరణలో యూనియన్ బ్యాంక్ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో శిక్షణకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీస్ అంశంలో 13 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణలో వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. 10వ తరగతి విద్యార్హత, 19 నుంచి 45ఏళ్ల మధ్య వయస్సు గల వారు ఈ నెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.


నేడు నరసన్నపేటలో మెగా జాబ్‌మేళా



నరసన్నపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖలు సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నారని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సాయి శ్రీనివాస్ తెలిపారు. 10వ తరగతి నుంచి పీజీ వరకూ విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనకు వీలుగా ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9.30 నుంచి కళాశాల ఆవరణలో జాబ్‌మేళా ఉంటుందని, 12 బహుళ జాతి కంపెనీల ప్రతినిధులు పాల్గొని అర్హత, కలిగిన నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఎంపికైన వారికి అర్హత పత్రాలు అందజేస్తారని వివరించారు. నిరుద్యోగ యువత విద్యార్హత పత్రాలు, ఆధార్ కార్డు, బయోడేటా పత్రాల జిరాక్స్‌లతో పాటు రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని కోరారు. రిజిస్ట్రేషన్ కోసం ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.



సొంతూరికి..



● మొదలైన సంక్రాంతి సందడి
● సొంతగూటికి వస్తున్న వలస పక్షులు
● 32 ప్రత్యేక రైళ్లతో షెడ్యూల్ విడుదల చేసిన దక్షిణ మధ్య రైల్వే
● విశాఖపట్నం చేరకుండా దువ్వాడ మీదుగా మళ్లింపు
● జిల్లా మీదుగా 7 రైళ్లు, 8 సర్వీసులు, 4 స్టాపేజీలు

కాశీబుగ్గ: సంక్రాంతికి సొంతూళ్లకు వస్తున్న వలస జీవుల కోసం రైల్వే శాఖ ఏర్పాట్లు మొదలుపెట్టింది. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు సంక్రాంతికి స్వగ్రామాలకు వస్తుండడంతో వారి కోసం ప్రత్యేక సర్వీసులు నడుపనుంది. మొత్తం 32 ప్రత్యేక రైళ్లు సికింద్రాబాద్- బ్రహ్మపురం, బ్రహ్మపురం-వికారాబాద్, విశాఖపట్నం-కర్నూలు సిటీ, శ్రీకాకుళం-వికారాబాద్, సికింద్రాబాద్-కాకినాడ టౌన్, సికింద్రాబాద్ -నర్సాపూర్ రూట్లలో నడపనుంది. జనవరి 14వతేదీ భోగి పండుగ, 15 మకర సంక్రాంతి, 16 కనుమ, 17 ముక్కనుమ పండుగల సందర్భంగా 7వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. వీటిలో శ్రీకాకుళం మీదుగా భువనేశ్వర్ వరకు సుమారు 7 ప్రత్యేక రైళ్లు నడుపుతున్నారు. రెగ్యులర్‌గా నడుస్తున్న రైళ్లకు ఆటంకం కలుగకుండా టైమ్‌టేబుల్ రూపొందించారు. ఈ ప్రత్యేక రైళ్లు విశాఖపట్నం చేరుకోకుండా దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస మీదుగా విజయనగరానికి చేరుకుంటాయి.

రైళ్లు ఇవే..

● సికింద్రాబాద్ నుంచి బ్రహ్మపూర్ వరకు ప్రత్యేక రైలు (07089) ఈనెల 7వ తేదీ, 14వ తేదీన రానుంది. 19.45 ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 11.15 గంటలకు గమ్యస్థానానికి చేరుతుంది.

● బ్రహ్మపురం నుంచి వికారాబాద్ వరకు ప్రత్యేక రైలు (07090) ఈనెల 8వ, 15వ తేదీల్లో నడపనున్నారు. ఇది మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 8.30 నిమిషాలకు గమ్యం చేరుకుంటుంది.

● వికారాబాద్ నుంచి బ్రహ్మపూర్ వరకు ప్రత్యేక రైలు (07091) ఈ నెల 9వ తేది, 16వతేదీల్లో నడపనున్నారు. ఇది సాయంత్రం 18.00 గంటలకు ప్రారంభమై మరుసటిరోజు ఉదయం 11.15 గంటలకు చేరుకుంటుంది.

● బ్రహ్మపూర్ నుంచి సికింద్రాబాద్ వరకు మూడు రాష్ట్రాలను కలుపుతూ వెళ్లే ప్రత్యేక రైలు(07092) ఇది. ఇది 10, 17వ తేదీలలో నడపనున్నారు. ఇది మధ్యాహ్నం 12.30 నుంచి 6.30 గంటలకు గమ్యస్థానాలకు చేరుస్తుంది.

● శ్రీకాకుళం నుంచి వికారాబాద్ వరకు ప్రత్యేక రైలు (08547) ఈనెల 2, 19, 26వ తేదీల్లో రానుంది. 17.00కు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 9.00 గంటలకు గమ్యస్థానానికి చేరుతుంది.

● వికారాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ప్రత్యేక రైలు (08548) ఈనెల 13, 20, 27వ తేదీల్లో రానుంది. 20.25కు ప్రారంభమై మరుసటి రోజు ఉదయం 12.15 గంటలకు గమ్యస్థానానికి చేరుతుంది.

● సికింద్రాబాద్ నుంచి బ్రహ్మపురం వరకు ప్రత్యేక రైలు (07094) ఈనెల 8, 15వ తేదీన నడుస్తుంది. ఈ రైలు 19.45కు బయల్దేరి 11.15 గంటలకు చేరుకుంటుంది.

● బ్రహ్మపురం నుంచి సికింద్రాబాద్ వరకు ప్రత్యేక రైలు (07094) ఈనెల 9, 16న నడుస్తుంది. ఈ రైలు మధ్యాహ్నం 12.30 ప్రారంభమై ఉదయం 6.00 గంటలకు చేరుకుంటుంది.

జిల్లాకు అనుకూలమే..



ట్రైన్ నంబర్ 07089/07090/07091/07092 ప్రత్యేక రైళ్లు ఎనిమిది సర్వీసులు రాకపోకల్లో నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి వంటి పరిమిత స్టేషన్‌లలో నిలుపుతారు. మన జిల్లాలో శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస), పలాస, సోంపేట, ఇచ్ఛాపురం వంటి ప్రత్యేకంగా కేటాయించిన స్టేషన్‌లలో మాత్రమే ఈ రైళ్లు ఆపుతారు. ఈ ప్రత్యేక రైళ్ళు విశాఖపట్నం స్టేషన్‌లోకి ప్రవేశించి తిరుగుముఖం కావడానికి సమయం పడుతుందని విశాఖపట్నంను తప్పించారు. ఇక్కడ దిగాలనుకున్న ప్రయాణికులు దువ్వాడ, పెందుర్తి, కొత్తవలసలో దిగవచ్చు. విశాఖపట్నం-కర్నూలు రైలు మాత్రం విశాఖపట్నంకు అనుసంధానం చేశారు. ఈ ప్రత్యేక రైళ్లలో ఫస్ట్ ఏసీ, సెకెండ్ ఏసీ, థర్డ్ ఏసీతో పాటు స్లీపర్, జనరల్ బోగీలు ఉంటాయని దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. రిజర్వేషన్లు కూడా మొదలైపోయాయి.

క్లుప్తంగా

మహిళ మెడలో బంగారు ఆభరణం చోరీ

రణస్థలం: మండలంలోని పతివాడపాలెం గ్రామానికి చెందిన పతివాడ లక్ష్మి అనే మహిళ మెడలో బంగారు ఆభరణాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. జేఆర్ పురం పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. లక్ష్మి పొలం పనులకు వెళ్లి వస్తుండగా మధ్యాహ్నం గ్రామంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయానికి సమీపంలోని మట్టి రోడ్డులో ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలో ఉన్న నగను లాక్కుని వెళ్లిపోయారు. ఆమె తేరుకునేలోపే వారు హైవేపైకి వెళ్లిపోయారు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్ పురం ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ తెలుగు మహాసభలకు కుప్పిలి, కర్నేనలకు ఆహ్వానం


కుప్పిలి వెంకట రాజారావు


కర్నేన జనార్దనరావు

ఆమదాలవలస: ఈ నెల 5, 6, 7 తేదీల్లో రాజమహేంద్రవరంలో జరగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో పాల్గొని కవితా గానం చేసేందుకు ఆమదాలవలసకు చెందిన కవులు, రచయితలు కుప్పిలి వెంకటరాజారావు, కర్నేన జనార్దనరావులకు ఆహ్వానం వచ్చినట్లు వారు గురువారం తెలిపారు. గజల్ శ్రీనివాస్, చైతన్య విద్యా సంస్థలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభల్లో ఇరువురు కవులు తమ కవితలను వినిపించనున్నామని తెలిపారు.

క్రికెట్ టోర్నీ పరిశీలకునిగా భాస్కర్


భాస్కర్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అడ్డయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల ఏడు నుంచి 15వ తేదీ వరకు తమిళనాడులోని చెన్నై హిందుస్థాన్ డీమ్డ్ యూనివర్సిటీలో సౌత్‌జోన్ అంతర విశ్వ విద్యాలయాల పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వ్యాయామ అధ్యాపకులు ఎ.భాస్కర్ పరిశీలకులుగా ఎంపికయ్యారు. ఈ ధ్రువీకరణ పత్రాలు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య అందజేశారు.

గుడ్ల గోదాము తనిఖీ

కోటబొమ్మాళి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు గుడ్లు సరఫరా చేస్తున్న గోదామును ఎంఈఓ-1 ఎస్.అప్పలరాజు గురువారం తనిఖీ చేశారు. కొన్ని పాఠశాలల్లో గుడ్లు ఉడకబెట్టే సమయంలో కరిగిపోతున్నాయని వంట ఏజెన్సీ మహిళలు ఎంఈఓకు ఫిర్యాదు చేయడంతో ఈ తనిఖీ చేపట్టారు. గుడ్లు నిల్వ చేసే షెడ్డులో గాలి, వెలుతురు సరిగా లేకపోవడంపై నిర్వాహకుడు శ్రీనివాస్‌ను ఎంఈఓ ప్రశ్నించారు. తక్షణమే శ్లాబు భవనంలోకి గుడ్లు మార్చాలని ఆదేశించారు. అంతకుముందు కోటబొమ్మాళి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన వంటకాలను ఎంఈఓ పరిశీలించారు. 520 గుడ్లలో 30 గుడ్లు కరిగిపోవడాన్ని గుర్తించారు. తరచూ ఇలా కరిగిపోతుండటంపై డీఈఓకు నివేదిక పంపిస్తానన్నారు.

ఎల్‌సీడీసీ సర్వే ప్రారంభం


సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

కోటబొమ్మాళి: జిల్లావ్యాప్తంగా 637 సచివాలయాల్లో గురువారం నుంచి ఎల్‌సీడీసీ(లెప్రసీ) సర్వే ప్రారంభమైంది. కుష్టువ్యాధి లక్షణాలు గుర్తింపులో భాగంగా గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు సంయుక్తంగా ఈ సర్వే చేస్తున్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్న వారిని గుర్తించి వివరాలను జిల్లా కుష్టు నివారణాధికారికి అందజేయనున్నారు. కోటబొమ్మాళి మండలం విశ్వనాథపురంలో డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు.

ఏబీ రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభం

ఎల్.ఎన్.పేట: మండలంలోని స్కాట్‌పేట నుంచి బొర్రంపేట వరకు ఏబీ (అలికాం-బత్తిలి) రోడ్డు అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు పనుల కోసం ప్రభుత్వం రూ.2.04 కోట్లు నిధులు విడుదల చేసింది. పనులు చేపట్టేందుకు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఇటీవలే శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో 6కిలోమీటర్ల మేరకు రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టామని ఆర్అండ్‌బీ జెఈ కిరణ్ కుమార్ తెలిపారు. రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా గోతులు కప్పటం, రోడ్డు పక్కన పిచ్చి మొక్కలు తొలగించటం వంటి పనులు చేస్తున్నారు.

అత్తరు నుంచి హల్వా వరకు..

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్ ఆకర్షిస్తోంది. అత్తరు నుంచి మాడుగల హల్వా వరకు అన్ని రకాల వస్తువులను ప్రదర్శన, విక్రయానికి ఉంచారు. రకరకాల వస్తువులు ఒకే చోట కనిపిస్తుండడంతో నగర వాసులు కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు.

– శ్రీకాకుళం పాత బస్టాండ్




అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం మీ స్వయం శక్తి సంఘం వారు ఏర్పాటు చేసిన ప్రత్యేక మాడుగుల హల్వా


ఏలూరు వినాయక స్వయం శక్తి సంఘం ఏర్పాటుచేసిన పచ్చళ్లు, ఇతర ఆహార పదార్థాలు


అనకాపల్లి జిల్లా పాయకరావుపేట వారు ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల స్టాల్


కృష్ణా జిల్లా మచిలీపట్నం వారి స్వయం శక్తి సంఘం ఏర్పాటుచేసిన కళంకారీ వస్త్ర దుకాణం (ఇన్‌సెట్లో) మన్యం జిల్లా మక్కువ మండలం కామేశ్వరమ్మ స్వయం శక్తి సంఘం వారు ఏర్పాటు చేసిన కర్ర బొమ్మలు, అగరొత్తులు, అత్తరు స్టాల్

ఉద్యమ స్ఫూర్తి.. చిలకమ్మ కీర్తి

- మంత్రిబుడి పేరుతో పోరాటాలు
- నేడు ఆమె జయంతి


కొండలోగాంలో నిర్మించిన సవర చిలకమ్మ (మంత్రిబుడి) స్మారకస్థూపం

మందస: సవర చిలకమ్మ.. ఈ పేరు తెలుసా..? మందస కొండల్లో చాలాకాలంగా ప్రతిధ్వనిస్తున్న పేరు ఇది. పీడిత తాడిత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా కొలువుండిపోయిన రూపం అది. శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటానికి ముందు నుంచి ఆమె మందస చుట్టుపక్కల ఉద్యమాలు చేశారు. ఆదివాసీ కుటుంబంలో పుట్టిన ఆమె మరో వీరగున్నమ్మలా విప్లవాలు నడిపారు. మంత్రి బుడి పేరుతో ఆదివాసీ హక్కుల కోసం ఉద్యమించారు. నేడు ఆమె జయంతి.

మందస మండలంలోని గిరిజన ప్రాంతమైన కొండలోగాం పంచాయతీ టబాగాం అనే చిన్న కుగ్రామంలో చిలకమ్మ జన్మించింది. శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగపోరాటం ప్రారంభానికి ముందు పార్టీలో లీగల్‌గా ఆమె పని చేశారు. విప్లవకారులకు సేవలు అందించారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడాలని గిరిజనులను చైతన్య పరిచారు. విప్లవకారులను ఆదరించాలని ఆదివాసీలను అవగాహన పరిచేవారు. 1968 నవంబరు 26న సాయుధ పోరాటం ప్రారంభం కాగా, ఏజెన్సీ.. ఉద్యమానికి కేంద్రబిందువుగా ఉన్న కొండలోగాం కేంద్రంగా సాయుధ ఉద్యమం చేశారు. తోటి గిరిజనులను చైతన్యపరిచి.. పోరాటాలకు సహకరించేవారు. పార్టీ సమావేశాలను గిరిజన భాషలోకి అనువదించి చెప్పేవారు. భుక్తికోసం.. హక్కు కోసం.. ఆదివాసీ విముక్తి కోసం.. పోరాడిన సవర చిలకమ్మ 1995 జనవరి 5న మరణించారు. ఆమె స్మారకార్థం కొండలోగాంలో భారీ స్థూపాన్ని జనశక్తి నేతలు పోతనపల్లి అప్పలస్వామి అలియాస్ కుమారన్న, జయక్క ఆధ్వర్యంలో నిర్మించారు. ఏటా ఆమె జయంతి, వర్ధంతులు జరుపుతున్నారు. ఈ ఏడాది కూడా ఆమె జయంతిని నిర్వహిస్తున్నారు. ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో ఈ నెల 5న మంత్రిబుడి జయంతిని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

డీఎల్‌డీఏ చైర్మన్‌గా నక్క తులసీదాస్


నక్క తులసీదాస్

సారవకోట: జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ చైర్మన్‌గా మండలంలోని బుడితి గ్రామానికి చెందిన నక్క తులసీదాస్ నియమితులైనట్లు గురువారం అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఈయన వైఎస్సార్ పార్టీ డెడికేటివ్ మండల కార్యదర్శిగా, జలుమూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, సారవకోట మండల జేసీఎస్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ కృషితో డీఎల్‌డీఏ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ పదవికి ఎంపిక కావడంతో వైఎస్సార్ పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అభినందనలు తెలిపారు. మండలంలో వైఎస్సార్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

6 నుంచి జాతీయ యువజన వారోత్సవాలు

శ్రీకాకుళం: ఈ నెల 18వ తేదీన స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని జనవరి 6వ తేదీ నుంచి జాతీయ యువజన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు శ్రీశారదారామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మందపల్లి రామకృష్ణారావు తెలిపారు. జనవరి 6వ తేదీన సరుబుజ్జిలి మండలంలో జాతీయ యువజన వారోత్సవాలు ప్రారంభిస్తామన్నారు. 12న శ్రీకాకుళంలో ముగిస్తామన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా జనవరి 6వ తేదీన విద్యార్థులకు వివేకానందుని సందేశం, 7న భారతీయ ఆదర్శాలు త్యాగం-సేవ, 8న యువతకు వివేకానందుని హితవు, 9న గ్రామ సేవయే రామ సేవ, 10న ధర్మ రక్షణ మోక్ష సాధన, 11న దేశ భద్రత సామాజిక బాధ్యత, జనవరి 12న స్వామి వివేకానంద జయంతి ఉత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, యువకులు, విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

2024లో సత్యసాయి సేవలపై ప్రణాళిక ఆవిష్కరణ


ప్రణాళిక పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు

శ్రీకాకుళం కల్చరల్: ఈ ఏడాది రాష్ట్రంలో నిర్వహించే సత్యసాయి సేవలపై యాక్షన్ ప్లాన్ (ప్రణాళిక)ను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, డీఈఓ వేంకటేశ్వరరావు గురువారం ఆవిష్కరించారు. నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం జరిగిన భజన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ 21 సార్లు ఓంకారాన్ని జపించాలన్నారు. 2024లో సంవత్సరంలో సత్య సాయి మందిరాల్లో సేవలు పెరుగుతాయని, లేటెస్టు టెక్నాలజీతో కూడిన సేవలు అందించడానికి ప్రణాళికలు వేస్తున్నామని తెలిపారు. రెండు మందిరాలు కలసి ఈ విధమైన భజన నిర్వహించడం ఎంతో ఆనందదాయకమన్నారు. జిల్లాలోని సత్య సాయి సభ్యులంతా ఏకతాటిపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వై.లింగరాజు, రిమ్స్ అన్నదాన పథకం అధ్యక్షులు గంగుల రమణబాబు, కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు, పెద్దమందిరం కన్వీనర్ కె.మురళీకృష్ణ, బ్యాంకర్స్ కాలనీ కన్వీనర్ ప్రసాద్, సాయి భక్తులు పాల్గొన్నారు.

ఆటో నుంచి జారిపడి విద్యార్థికి గాయాలు


గాయాలతో బయటపడిన బాలుడు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన విద్యార్థి ఆటో నుంచి జారి పడి గాయపడ్డాడు. గురువారం ఉదయం పాఠశాలకు వెళ్తున్న ఆటో కాశీబుగ్గ బస్టాండ్ సమీపానికి వచ్చేసరికి అందులో నుంచి ఓ విద్యార్థి రోడ్డుపైకి తుళ్లిపడ్డాడు. గమనించిన తోటి విద్యార్థులు కేకలు వేసినా ఆటో డ్రైవర్ ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. వెనుక వస్తున్న వాహనదారులు గమనించడంతో ప్రమాదం తప్పింది. అనంతరం బాలుడికి సపర్యలు చేసి తల్లిదండ్రులకు అప్పగించారు.

'ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోండి'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జ్ఞాన సువర్ణ రాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: లోక్ అదాలత్ ద్వారా లభించే ఉచిత న్యాయ సేవలు వినియోగించుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.జ్ఞాన సువర్ణ రాజు అన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారికి, స్త్రీలు, పిల్లలు, దివ్యాంగులు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన వారికి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సత్వర న్యాయ పరిష్కారం కోసం 'శాశ్వత లోక్ అదాలత్' ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఆయన గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రజా ప్రయోజిత సేవలపై అవగాహన సదస్సులో మాట్లాడారు. ప్రాథమిక హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లినా ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చున్నారు. న్యాయ సేవలు ఎలా ఉపయోగించుకోవాలో పలు ఉదాహరణలతో వివరించారు. ప్రభుత్వ పౌర సేవల్లో ఎలాంటి లోపాలు ఎదురైనా తమ వద్దకు వచ్చి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని అన్నారు. సామాజికవేత్త గేదెల ఇందిరా ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

ఆపదలో ఆదుకున్న యువకుడు


రక్తదానం చేస్తున్న అంబటి రాజు

కాశీబుగ్గ: రెండు కిడ్నీలు పాడై తీవ్ర అనారోగ్యానికి గురైన వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు గ్రామానికి చెందిన సత్యనారాయణకు ఓ యువకుడు రక్తదానం చేసి ఆదుకున్నాడు. పలాస కిడ్నీ పరిశోధన కేంద్రం, డయాలసిస్ కేంద్రంలో బాధితుడు చికిత్స పొందుతుండగా 'ఓ పాజిటివ్' గ్రూపు రక్తం గురువారం అత్యవసరమైంది. విషయం తెలుసుకున్న అక్కుపల్లికి చెందిన అంబటి రాజు రక్తదానానికి ముందుకొచ్చారు. ఈ సందర్భంగా యువకుడిని అభినందించారు.

వర్సిటీ క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన క్రికెట్ క్రీడాకారులతో వర్సిటీ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఈ నెల 7వ తేదీ నుంచి 15వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని హిందుస్థాన్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సౌత్ జోన్ అంతర విశ్వ విద్యాలయాల క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల క్రికెట్ జట్టును బుధ, గురువారాల్లో చిలకపాలెంలోని శ్రీ శివానీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ క్రికెట్ మైదానంలో ఎంపిక చేశారు. ఈ ఎంపికలకు 28 కళాశాలల నుంచి 89 మంది రాగా, తుది జట్టు ప్రతిభ ఆధారంగా 15 మందిని ఎంపిక చేశారు.

వీరు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. వర్సిటీకి మంచి పేరు తెచ్చేలా మెరుగైన ప్రదర్శన చేయాలని సూచించారు.

నాడు-నేడు సామగ్రి చోరీ

కాశీబుగ్గ: పలాస మండలం పండాశాశనాం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాత్రి దొంగలు పడ్డారు. ఇటీవల రూ.8లక్షలతో నిర్మించిన అధునాతన మరుగుదొడ్లలో ఉన్న ఖరీదైన ట్యాప్‌లు, పైపులు, ఇతర గృహోపకరణాలను దొంగిలించారు. ఉదయానికి ట్యాంక్‌లో నీరంతా ఆరుబయటకు రావడంతో గమనించిన గ్రామస్తులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుసక రామారావుకు సమాచారం అందజేశారు. పాఠశాల సమయానికి ముందే వచ్చిన ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రాజాం కూర్మారావుతో కలిసి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గురువారం నాడు మధ్యాహ్న భోజన వంటకు, చిన్నారులు మరుగుదొడ్లకు అవసరమైన మంచినీరు అందుబాటులోకి రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. పండాశాసనాం, హరిజన వీధి నుంచి మంచినీటిని తీసుకువచ్చి సర్దుబాటు చేశారు. కాశీబుగ్గ సీఐ నవీన్ కుమార్‌కు సమాచారం అందించారు.


ట్యాప్‌లు తీసుకుపోయిన అగంతకులు

జాతీయ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు 'కూన'


కూన రామచంద్రను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు, పీడీలు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రతిష్టాత్మక జాతీయ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన కూన రామచంద్రరావు ఎంపికయ్యాడు. ఈ మేరకు ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ నుంచి వర్తమానం అందింది. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు తెలంగాణలోని జనగామ వేదికగా ఆలిండియా సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు జిల్లాలోని ఎచ్చెర్ల మండల పరిధిలోని కేశవరావుపేట గ్రామానికి చెందిన కూన రామచంద్రరావు ఎంపికయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ఈ యువ క్రీడాకారుడు ప్రాతినిధ్యం వహించనున్నాడు. ఈ పోటీల కోసం ఈనెల 10న ఏపీ జట్టుతోపాటు పయనమవుతున్నాడు.

నేటి నుంచి జరిగే శిక్షణ శిబిరాలకు హాజరు..

జాతీయ సౌత్‌జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ముందు నేటి నుంచి మొదలయ్యే శిక్షణ శిబిరాలకు రామచంద్ర హాజరవుతున్నాడు. ఈ శిక్షణ శిబిరాలు అనంతపురంలోని ఆర్‌డీటీ క్రీడా ప్రాంగణం వేదికగా ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు 6 రోజుల పాటు జరగనున్నాయి. కేశవరావుపేటలోని నిరుపేద కుటుంబానికి చెందిన రామచంద్ర తల్లిదండ్రులు కూన వెంకటరావు, కుమారిలు రోజువారీ కూలి పనిచేస్తుంటారు. రామచంద్ర బీఆర్‌ఏయూలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. స్పోర్ట్స్ కోటాలో రైల్వేలో స్థిరపడి తల్లిదండ్రులను బాగా చూసుకుంటానని, సాఫ్ట్‌బాల్ గేమ్‌ను అభివృద్ధి చేస్తానని రామచంద్ర చెబుతున్నాడు.

అభినందనల వెల్లువ..

రామచంద్ర నేషనల్ సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కలిదిండి నరసింహారాజు, ప్రధాన కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. ఈ పోటీల్లో ఆంధ్రా జట్టును విజయపథంలో నిలపాలని వారు ఆకాంక్షించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షులు ఎంవీ రమణ, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, ఉపాధ్యక్షుడు ఎం.తిరుపతిరావు, ఎం.ఆనంద్‌కిరణ్, జాయింట్ సెక్రటరీ అన్నెపు రాజగోపాల్, పి.రమేష్, జి.మల్లేష్, ఢిల్లీ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.